సాక్షి భద్రాద్రి కొత్తగూడెం

ఆదివారం । 7 । జనవరి । 2024



బిల్లులు చెల్లించరు..

ప్రభుత్వ పాఠశాలల్లోని మధ్యాహ్న భోజన కార్మికులకు వేతనాలు, బిల్లులు సకాలంలో విడుదల కాక ఇబ్బంది పడుతున్నారు. 8లో



ఇల్లెందుకు ఓడీఎఫ్ డబుల్ ప్లస్

కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన అవార్డుల్లో ఇల్లెందు మున్సిపాలిటీకి ఓడీఎఫ్ విభాగంలో డబుల్ ప్లస్ పురస్కారం దక్కింది. 8లో

గరిష్టం / కనిష్టం
29° / 18°

వాతావరణం

జిల్లాలో ఆదివారం పగటి ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పడతాయి. తెల్లవారుజామున, రాత్రి వేళల్లో చలి ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన సేవలు



రికార్డులు పరిశీలిస్తున్న శిరీష

అన్నపురెడ్డిపల్లి : ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ శిరీష అన్నారు. అన్నపురెడ్డిపల్లి మండలం ఎర్రగుట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం ఆమె తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి, బాధితులకు అందుతున్న వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రసవాల సంఖ్య పెంచేలా సిబ్బంది కృషి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి బాలాజీ, పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ తన్మయి తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరం పరిశీలన..

చండ్రుగొండ : మండలంలోని సీతాయిగూడెంలో ఎర్రగుంట పీహెచ్‌సీ ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటుచేసిన వైద్య శిబిరాన్ని డీఎంహెచ్‌ఓ శిరీష పరిశీలించారు. వ్యాధి నిరోధక టీకాలు వేసే కార్యక్రమాన్ని, కోల్డ్‌చైన్ సిస్టం, ఎమర్జెన్సీ కిట్, రికార్డులను తనిఖీ చేశారు. కార్యక్రమంలో వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమ అధికారి డాక్టర్ బాలాజీ, సీహెచ్‌ఓ నాగభూషణం, డాక్టర్ ప్రియాంక, ఏఎన్‌ఎంలు టి.సుశీల, పి.భవాని, ఎంఎల్‌హెచ్‌పీ హారిక, ఆశవర్కర్ నారాయణమ్మ పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక

కొత్తగూడెంఅర్బన్: ఈనెల 9 నుంచి 12వ తేదీ వరకు న్యూఢిల్లీలో జరిగే జాతీయస్థాయి కళా ఉత్సవ్ పోటీలకు జిల్లా నుంచి ఐదుగురు విద్యార్థులు ఎంపకయ్యారని డీఈఓ ఎం.వెంకటేశ్వరాచారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గత నవంబర్ 13, 14 తేదీల్లో జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొని ప్రథమ బహుమతి సాధించిన కె.హాసిని, ఎ. మల్లికార్జున్, బి.షణ్ముఖ వర్ధన్, టి.చరణ్ తేజ్, ఎం.యశ్వంత్.. అదే నెల 15, 16 తేదీల్లో హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి కళాఉత్సవ్ పోటీలలో పాల్గొని జాతీయ స్థాయికి ఎంపికయ్యారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర ప్రతినిధి బృందానికి నాయకుడిగా జిల్లా విద్యాశాఖ అకడమిక్ మానిటరింగ్ అధికారి ఎ.నాగరాజశేఖర్ ఎంపిక కావడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. ఆయన ఎంపిక పట్ల విద్యాశాఖ సెక్టోరియల్ అధికారులు సైదులు, సతీష్, అన్నామణి అభినందనలు తెలిపారు.

ఆన్‌లైన్ ప్రక్రియ త్వరగా పూర్తిచేయాలి

డీపీఓ రమాకాంత్



ఆన్‌లైన్ ప్రక్రియను పరిశీలిస్తున్న డీపీఓ

బూర్గంపాడు: ప్రజాపాలన గ్రామసభల్లో వచ్చిన దరఖాస్తులను త్వరితగతిన ఆన్‌లైన్ చేయాలని జిల్లా పంచాయతీ అధికారి లక్కినేని లక్ష్మీ రమాకాంత్ అన్నారు. బూర్గంపాడు మండల పరిషత్ కార్యాలయంలో జరుగుతున్న ఆన్‌లైన్ ప్రక్రియను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గ్రామసభల్లో వచ్చిన ప్రతీ దరఖాస్తును తప్పనిసరిగా, జాగ్రత్తగా ఆన్‌లైన్ చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వివేక్‌రామ్, ఎంపీఓ సునీల్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ జాబితాలో అభ్యంతరాలుంటే తెలపండి

కొత్తగూడెంఅర్బన్: జిల్లా ఓటర్ల ముసాయిదా జాబితాను కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అల శనివారం ప్రకటించారు. జాబితాలో ఏమైనా అభ్యంతరాలుంటే నిర్దేశిత ప్రొఫార్మాలో ఈనెల 22 వరకు తెలియజేయాలని సూచించారు. జిల్లాలోని ఐదు నియోజకవర్గాల్లో మొత్తం 9,72,858 మంది ఓటర్లు ఉన్నట్లు చెప్పారు. వీరిలో 4,74,520 మంది పురుషులు, 4,98,290 మంది స్త్రీలు, ఇతరులు 48 మంది, ఎన్నారైలు 53 మంది, సర్వీస్ ఓటర్లు 728 మంది ఉన్నారని వివరించారు. నిర్దేశించిన గడువులోగా వచ్చిన అభ్యంతరాలపై క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి ఫిబ్రవరి 8న తుది జాబితా ప్రకటిస్తామని చెప్పారు. నూతన ఓటరు నమోదుకు ఫారం – 6, తప్పొప్పుల సవరణకు ఫారం– 8, ఓటరు జాబితాలోని పేర్లపై ఆక్షేపణలు, వలస వెళ్లిన, మరణించిన వారి వివరాలు తెలపడానికి ఫారం–7 లో వివరాలు అందజేయాలని కలెక్టర్ పేర్కొన్నారు.

‘ప్రజాపాలన’కు పోటెత్తారు..



4 ఇంక్లైన్ గ్రామసభలో దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు

గ్రామసభలకు విశేష స్పందన

- జిల్లాలో మొత్తం దరఖాస్తులు 3,33,370
- ప్రారంభమైన ఆన్‌లైన్ నమోదు
- ఈనెల 17 వరకు కొనసాగనున్న ప్రక్రియ

చుంచుపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారంటీల అమలు కోసం ప్రజాపాలన కార్యక్రమాన్ని చేపట్టింది. జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీల పరిధిలోని 104 వార్డులు, 481 గ్రామ పంచాయతీల్లో డిసెంబర్ 28 నుంచి జనవరి 6 వరకు గ్రామ, వార్డు సభలు నిర్వహిస్తూ ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించింది. ఈ సభలకు జిల్లా వ్యాప్తంగా విశేష స్పందన లభించింది. శనివారం సభలు ముగిసే నాటికి జిల్లాలో 3,33,370 దరఖాస్తులు వచ్చాయి. అభయ హస్తం దరఖాస్తులతో పాటు ఇతర పథకాలకు మరో 36,645 అర్జీలు అందాయి. గ్రామసభలకు వచ్చే వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు సరిపడా కౌంటర్లు ఏర్పాటు చేసి దరఖాస్తులు స్వీకరించారు. ప్రజలు ప్రధానంగా మహాలక్ష్మి, రూ.500కే గ్యాస్ సిలిండర్, రైతు భరోసా, చేయూతతో పాటు ఇందిరమ్మ ఇంటి పథకాలకు భారీగా దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. గ్రామసభల నిర్వహణ తీరును మండల అధికారుల బృందాలు ప్రత్యక్షంగా పర్యవేక్షించాయి.

ఆన్‌లైన్ ప్రక్రియ షురూ..

ప్రజాపాలన గ్రామసభల్లో స్వీకరించిన దరఖాస్తుల వివరాలను అధికారులు శనివారం నుంచి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. ఇందుకోసం ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను అందుబాటులోకి తేవడంతో పాటు ప్రత్యేకంగా సిబ్బందిని కేటాయించారు. జిల్లాలోని పంచాయతీలు, మండల పరిషత్, తహసీల్దార్, ఈజీఎస్, సెర్ప్, పీఆర్ తదితర ప్రభుత్వ కార్యాలయాల్లో కంప్యూటర్ ఆపరేటర్లుగా పనిచేస్తున్న సుమారు 520 మంది సిబ్బందిని దీనికోసం నియమించారు. వీరందరికీ కలెక్టరేట్‌లో శుక్రవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆపరేటర్ పేరుతో ప్రత్యేక లాగిన్ కేటాయించి ఫోన్‌కు వచ్చే ఓటీపీతో డేటా ఎంట్రీ చేపడతారు. ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తయ్యాక వచ్చే రిజిస్టర్ నంబర్‌ను దరఖాస్తుపై రాస్తున్నారు. అలాగే ఒక్కో దరఖాస్తుకు ప్రత్యేకంగా యూనిట్ కోడ్ నంబర్‌ను కేటాయించి లబ్ధిదారుల వివరాలను పొందుపర్చుతారు. భవిష్యత్‌లో ఈ యూనిట్ కోడ్ నంబర్‌కే దరఖాస్తుదారుల ఆధార్‌ను అనుసంధానం చేయనున్నట్లు సమాచారం. జిల్లాలో ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ ఈనెల 17 వరకు కొనసాగనుంది. శనివారం నుంచి మండలాల వారీగా కంప్యూటర్ ఆపరేటర్లు అభయహస్తం దరఖాస్తుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తుండటంతో జిల్లా అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఆన్‌లైన్ విధానంలో ఎక్కడా పొరపాట్లు జరగకుండా జిల్లా, మండల స్థాయి అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.

జిల్లాలో వచ్చిన దరఖాస్తుల వివరాలు

తేదీ	దరఖాస్తులు
డిసెంబర్ 28	25,087
29	44,711
30	33,558
జనవరి 2	51,484
3	45,691
4	42,039
5	49,257
6	41,543

కలెక్టర్ హర్షం

కొత్తగూడెంఅర్బన్: ప్రజాపాలన గ్రామసభలు విజయవంతం కావడం పట్ల కలెక్టర్ ప్రియాంక అల హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ మహోన్నత కార్యక్రమంలో భాగస్వాములైన ప్రతీ ఒక్కరిని ఆమె అభినందించారు. గ్రామ సభల నిర్వహణ కార్యక్రమాన్ని ఎప్పటికప్పుడు ప్రజలకు తెలియజేయడం ద్వారా క్షేత్రస్థాయిలో మంచి స్పందన వచ్చిందని పేర్కొన్నారు. జిల్లాలో 481 గ్రామ పంచాయతీలు, 104 మున్సిపల్ వార్డుల్లో ప్రజాపాలన సభలు నిర్వహించి 3,22,501 గృహాల నుంచి 3,33,370 దరఖాస్తులు స్వీకరించామని వివరించారు.

సొంతింటి కోసం దరఖాస్తు చేసుకున్నా



ప్రభుత్వం ప్రజాపాలనలో ఏర్పాటు చేసిన గ్రామసభలో సొంతిల్లు, గ్యాస్, కరెంట్ పథకాలకు దరఖాస్తు చేసుకున్నా. అధికారులు ముందుగానే దరఖాస్తు ఫారం ఇచ్చారు. పంచాయతీ సిబ్బంది దగ్గరుండి వివరాలు అడిగి సహకరించారు. సొంతింటి కల సాకారం అవుతుందని ఆశిస్తున్నా.

– ఎలుక వినోద, బాబుక్యాంప్

సందేహాలను నివృత్తి చేశారు



ప్రభుత్వం అమలు చేసే ఆరు గ్యారంటీల కోసం గ్రామసభలో అధికారులకు దరఖాస్తు అందజేశాను. పంచాయతీ అధికారులు ఫారాన్ని ఒకరోజు ముందే ఇంటికి వచ్చి ఇచ్చారు. దానిలో పూర్తి వివరాలు, కావాల్సిన పథకాలను ఎంపిక చేసుకొని పూరించాం. కొన్ని సందేహాలకు అధికారులు నివృత్తి చేసి రశీదు ఇచ్చారు.

– పట్నం సుగుణ, బాబుక్యాంప్

రామయ్యకు రాజఖడ్గం సమర్పణ



రాజఖడ్గాన్ని ప్రదర్శిస్తున్న అర్చకులు

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవస్థానానికి ఉత్తరాది పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ మధ్వాచార్య మూల మహాసంస్థానం వారు రాజఖడ్గం, డాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయ వేద పండితులు, అర్చకులు వాటికి ప్రత్యేక పూజలు చేశారు. బంగారు పూత ఖడ్గంతో పాటు బంగారు, రాగి పూతగల డాలు అందజేశారు. వీటి విలువ రూ.3.10 లక్షలు ఉంటుందని ఆలయ అధికారులు వెల్లడించారు. కార్యక్రమంలో ఈఓ రమాదేవి, వేద పండితులు, అర్చకులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా రామయ్య నిత్య కల్యాణం

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి నిత్యకల్యాణ వేడుక శనివారం నేత్రపర్వంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన, తదితర పూజలు చేశారు. అనంతరం స్వామివారిని మేళతాళాల నడుమ తీసుకొచ్చి బేడా మండపంలో కొలువుదీర్చారు. విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశాక.. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా జరిపించారు. భక్తులు భారీగా తరలిరావడంతో ఆయల పరిసరాలు సందడిగా మారాయి.

పెద్దమ్మతల్లి ఆలయంలో | పవిత్రోత్సవాలు ప్రారంభం



అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే కూనంనేని తదితరులు

పాల్వంచరూరల్ : మండల పరిధిలోని కేశవాపురం – జగన్నాథపురం గ్రామాల మధ్య కొలువై ఉన్న శ్రీ పెద్దమ్మతల్లి ఆలయంలో మూడు రోజుల పాటు జరుగనున్న పవిత్రోత్సవాలు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయంలో ఏడాది పాటు నిర్వహించే పూజల్లో ఏవైనా లోటుపాట్లు జరిగితే దోష నివారణతో పాటు ఆలయ పవిత్రత, భక్తుల శ్రేయస్సు కోసం ఈ ఉత్సవాలు నిర్వహిస్తామని ఆలయ అర్చకులు, వేద పండితులు వివరించారు. కాగా, ఈ వేడుకలకు స్థానిక ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ ఎం.రామలింగం, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, సర్పంచ్ అనిత, యర్రంశెట్టి ముత్తయ్య, వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులపై ఒత్తిడి తగ్గించాలి

ఇస్రో శాస్త్రవేత్త సెంథిల్ కుమార్



మాట్లాడుతున్న సెంథిల్‌కుమార్

పాల్వంచరూరల్ : ప్రస్తుతం విద్యార్థులపై సామాజిక ఒత్తిడి ఎక్కువగా ఉందని, దాన్ని తగ్గించాలని సతీష్‌ధావన్ అంతరిక్ష కేంద్రం ఉప సంచాలకులు ఆర్.సెంథిల్‌కుమార్ అన్నారు. మండల పరిధిలోని బస్వతారక కాలనీలో గల హరితావరణ విద్యాపీఠంలో శనివారం రోటరీక్లబ్ ఆఫ్ కొత్తగూడెం ఆధ్వర్యంలో జరిగిన సమ్మేళనానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యార్థులపై ఒత్తిడి పెంచకుండా వారికి నచ్చిన కోర్సులు చదువుకోనివ్వాలని తల్లిదండ్రులను కోరారు. అంతరిక్ష రంగంలో ఇస్రో తిరుగులేని సంస్థగా ఎదిగిందని, హోమీ జహంగీర్, సతీష్ ధావన్, అబ్దుల్ కలాం లాంటి శాస్త్రవేత్తల కృషే ఇందుకు కారణమని వివరించారు. విద్యాపీఠం అధ్యక్షురాలు పేరం సుజాత ఆధ్వర్యంలో జరిగిన సమ్మేళనంలో రోటరీ క్లబ్ శిక్షకులు ఉండేటి ఆనంద్‌కుమార్, విద్యాపీఠం బాధ్యులు పుట్టగుంట సుధాకర్‌రావు, క్లబ్ సభ్యులు సత్యనారాయణ, వెంకట్రామయ్య, నాగరాజు, చలపతిరావు, జక్కుల రవి పాల్గొన్నారు.

కోర్టులో ఖాళీలు భర్తీ చేస్తాం

- జిల్లా జడ్జి పాటిల్ వసంత్
- ఇల్లెందు కోర్టు తనిఖీ



జిల్లా ప్రధాన న్యాయమూర్తికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న జడ్జి కీర్తి చంద్రికా రెడ్డి

ఇల్లెందు: ఇల్లెందు కోర్టులో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేస్తామని, నూతన భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామని జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్ హామీ ఇచ్చారు. శనివారం ఆయన ఇల్లెందు పీడీఎం కోర్టును సందర్శించారు. పలు రికార్డులను పరిశీలించారు. అంతకుముందు పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. స్థానిక న్యాయమూర్తి దేవరపల్లి కీర్తి చంద్రికా రెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మామిడి సత్యప్రకాశ్, న్యాయవాదులు భూక్యా రవికుమార్, కీర్తి కార్తీక్, ఉమామహేశ్వరరావు, సిబ్బంది జడ్జికి ఘన స్వాగతం పలికారు.

శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యత

ఎస్పీ రోహిత్‌రాజు



రోహిత్‌రాజ్‌కు బాధ్యతలు అప్పగిస్తున్న వినీత్

కొత్తగూడెంటౌన్: జిల్లా నూతన ఎస్పీగా బిరుదరాజు రోహిత్‌రాజు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణే తన లక్ష్యమని చెప్పారు. శాంతిభద్రతలకు ఎవరు విఘాతం కలిగించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కాగా, ఎస్పీ రోహిత్‌రాజును జిల్లా పోలీసు అధికారులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

వినీత్‌కుమార్‌కు ఘన వీడ్కోలు..

జిల్లా ఎస్పీగా విధులు నిర్వహించి మాదాపూర్ డీసీపీగా బదిలీ అయిన డాక్టర్ వినీత్‌కుమార్‌కు జిల్లా పోలీసులు శనివారం ఘనంగా వీడ్కోలు పలికారు. పోలీసు వాహనంపై ఊరేగింపు నిర్వహించి దారివెంట పూలు చల్లుతూ తమ అభిమానాన్ని చాటుకున్నారు. వినీత్ ఏఎస్పీగా, ఎస్పీగా జిల్లాలో గత నాలుగు సంవత్సరాలుగా శాంతిభద్రతల పరిరక్షణకు అహర్నిశలు కృషి చేశారని అన్నారు. కార్యక్రమంలో కొత్త ఎస్పీ రోహిత్‌రాజుతో పాటు ఏఎస్పీలు టి.సాయిమనోహర్, పరితోష్‌పంకజ్, డీఎస్పీ అబ్దుల్ రెహమాన్, సీఐలు కరుణాకర్, మురళి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సంక్రాంతికి 276 ప్రత్యేక బస్సులు

ఖమ్మం మామిళ్లగూడెం: సంక్రాంతి పండుగ సందర్భంగా ఖమ్మం రీజియన్ పరిధిలోని డిపోల నుంచి 276 ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు రీజినల్ మేనేజర్ సీహెచ్.వెంకన్న తెలిపారు. ఈనెల 10నుంచి 15వ తేదీ వరకు ప్రత్యేక బస్సులు ఉంటాయని పేర్కొన్నారు. రీజియన్‌లోని ఖమ్మం డిపో నుండి 66బస్సులు, మధిర నుండి 38, సత్తుపల్లి నుండి 55, భద్రాచలం నుండి 45, కొత్తగూడెం నుండి 33, మణుగూరు నుండి 23, ఇల్లెందు డిపో నుంచి 16బస్సులు నడిపేలా ప్రణాళిక సిద్ధం చేశామని తెలిపారు. మహాలక్ష్మి పథకం నేపథ్యాన రద్దీ ఉండే అవకాశమున్నందున ప్రయాణికులు తమ ప్రయాణాలపై కార్యాచరణ రూపొందించుకోవాలని ఆర్‌ఎం కోరారు. అయితే, ప్రయాణికులకు అసౌకర్యం కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని డీఎంలను ఆదేశించిన ఆర్‌ఎం.. రద్దీ వేళల్లో అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసుల సాయం తీసుకోవాలని తెలిపారు. కాగా, అదనపు సర్వీసుల్లోనూ సాధారణ చార్జీలే ఉంటాయని, పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో బస్సుల్లో మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలు ఉచితంగా ప్రయాణించవచ్చని ఆర్‌ఎం వెల్లడించారు.

ప్రజలకు సేవకుడిగా పనిచేస్తా..

- మధిర ప్రజలు తలెత్తుకునేలా పాలన చేస్తా
- నాకు రాజకీయ జన్మనిచ్చిన ఈ గడ్డ అభివృద్ధికి కృషి
- పౌర సన్మాన సభలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



భట్టి విక్రమార్క - నందిని దంపతులను సన్మానిస్తున్న నాయకులు

మధిర: అధికారంతో విర్ర వీగకుండా వెన్నులో భయం పెట్టుకుని మరీ ఇందిరమ్మ రాజ్యంలో ప్రజలకు సేవకుడిగా పనిచేసి అప్పుల రాష్ట్రాన్ని గట్టెక్కించేందుకు నిరంతరం శ్రమిస్తానని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క వెల్లడించారు. మధిరలో శనివారం రాత్రి కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పౌర సన్మాన కార్యక్రమానికి తన సతీమణి నందినితో కలిసి భట్టి హాజరయ్యారు. తొలుత ఆయనకు మధిరలోని అంబేద్కర్ సెంటర్ వద్ద భారీ గజమాలతో స్వాగతం పలికారు. అక్కడ అంబేద్కర్ విగ్రహానికి, వైఎస్సార్ చౌరస్తా వద్ద దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. ఆతర్వాత ర్యాలీగా సభావేదిక వద్దకు చేరుకున్న భట్టి దంపతులను కాంగ్రెస్‌తో పాటు పలు పార్టీల నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక, ఇంధన, ప్రణాళిక శాఖలను సమర్థవంతంగా నిర్వర్తించి మధిర ప్రజలు తలెత్తుకునేలా పాలన సాగిస్తానని తెలిపారు. పదేళ్ల తెలంగాణను పాలించిన బీఆర్‌ఎస్ ప్రభుత్వం రూ.7లక్షల కోట్ల అప్పులు చేయగా... అప్పుల ఊబి నుంచి గట్టెక్కించేందుకు అహర్నిశలు పాటుపడతానని చెప్పారు. బీఆర్‌ఎస్ నిర్వాకంతో రూ.1.10 లక్షల కోట్ల రుణాలతో ఉన్న విద్యుత్ రంగాన్ని కాపాడుతూనే ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఉద్యోగులకు రెండో తేదీన వేతనాలు ఇచ్చామని చెప్పారు. పక్కా ప్రణాళికలతో సంపద సృష్టించి, ఆ సంపదను ప్రజలకు పంచడమే ఆరు గ్యారంటీల అమలు లక్ష్యమని భట్టి వివరించారు. కాగా, తాము అధికారంలోకి వచ్చినెల కాకముందే హామీల అమలుపై ప్రశ్నిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు వారి హయాంలో ఎన్ని హామీలు విస్మరించారో గుర్తుచేసుకోవాలని హితవు పలికారు.

మధిర అంటే ప్రాణం

రాజకీయంగా తనకు జన్మనిచ్చిన మధిర నియోజకవర్గమంటే ప్రాణమని, ఈ నియోజకవర్గ అభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తానని భట్టి వెల్లడించారు. ఆదిలాబాద్ నుంచి ఖమ్మం వరకు పీపుల్స్‌మార్చ్ పేరిట చేసిన పాదయాత్ర ద్వారా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభంజనం సృష్టించిందని, మధిర ప్రజలు ఇచ్చిన శక్తి కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకురావడానికి ఉపయోగపడిందని తెలిపారు. కాగా, బీఆర్‌ఎస్ పాలనలో ఒత్తిళ్లు, వేధింపులకు లొంగకుండా పదేళ్లు కడుపులో పెట్టి కాపాడిన ప్రతీ ఒక్కరికి రుణపడి ఉంటానని భట్టి విక్రమార్క వెల్లడించారు. అనంతరం మధిర బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు మల్లాది వాసు, సవిత దంపతులు భట్టిని ఘనంగా సన్మానించగా వాసు మాట్లాడారు. నియోజకవర్గ అభివృద్ధిని పరిశీలిస్తే భట్టి ముందు, భట్టి తర్వాత అని భవిష్యత్ తరాలు చెప్పుకుంటాయని చెప్పారు. ఈ సభలో వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్, డీసీసీ అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, నాయకులు పోట్ల నాగేశ్వరరావు, డాక్టర్ కోట రాంబాబు, అయిలూరి వెంకటేశ్వరరెడ్డి, సూరంశెట్టి కిషోర్, వేమిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, కోనా ధనికుమార్, రంగా హన్మంతరావు, రంగా శ్రీనివాసరావు, దారా బాలరాజు, అద్దంకి రవికుమార్, చిలువేరు బుచ్చిరామయ్య పాల్గొన్నారు.

దేశంలోనే మోడల్‌గా ‘ఇందిరమ్మ’ డెయిరీ

ఎర్రుపాలెం: దేశంలోనే మోడల్‌గా నిలిచేలా ఇందిరమ్మ డెయిరీ పరిశ్రమను మధిర నియోజకవర్గంలో ఏర్పాటు చేయనున్నట్లు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వెల్లడించారు. ఈ దిశగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆయన ఆదేశించారు. ఎర్రుపాలెం మండలంలోని మామునూరులోని పేట చెరువు వద్ద శనివారం జిల్లాస్థాయి అధికారులతో ఆయన సమీక్షించారు. ఈసమావేశంలో కలెక్టర్ వీ.పీ.గౌతమ్ కూడా పాల్గొనగా.. డిప్యూటీ సీఎం మాట్లాడుతూ ఇందిరమ్మ డెయిరీ ఏర్పాటైతే ఇక్కడి మహిళలు, యువతకు ఉపాధి అవకాశాలు పుష్కలంగా లభిస్తాయని తెలిపారు. ఆతర్వాత మిషన్ భగీరథ, జలవనరుల శాఖాధికారులతో అభివృద్ధి పనులపై సమీక్షించిన డిప్యూటీ సీఎం, కట్లేరు కాల్వల ఆధునికీకరణపై దృష్టి సారించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పోలీసు కమిషనర్ సునీల్‌దత్, జెడ్పీ సీఈఓ వీ.వీ.అప్పారావు, మిషన్ భగీరథ సీఈ కె.శ్రీనివాస్, ఎస్‌ఈ సదాశివకుమార్, ఇరిగేషన్ ఎస్‌ఈ ఆనంద్‌కుమార్, ఆర్‌అండ్‌బీ ఈఈ శ్యాంప్రసాద్, ఆర్డీఓ గణేష్, డీఆర్‌డీఓ విద్యాచందన, ఎంపీపీ దేవరకొండ శిరీష, సర్పంచ్‌లు మారాబత్తుల మోహన్‌రావు, వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి, జంగా పుల్లారెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ అయిలూరి వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు. కాగా, మామునూరులో కాంగ్రెస్ నాయకులు, నాయకులు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కను ఘనంగా సత్కరించారు. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఓవరాల్ చాంపియన్ ‘ఉట్నూరు’

పాల్వంచ మండలం కిన్నెరసాని స్పోర్ట్స్ స్కూల్‌లో మూడు రోజులుగా జరుగుతున్న రాష్ట్రస్థాయి గిరిజన గురుకులాల క్రీడోత్సవాలు శనివారం ముగిశాయి. ఈ పోటీల్లో ఆదిలాబాద్ జిల్లా ఉట్నూరు ఐటీడీఏ పరిధిలోని గురుకులాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చి ఓవరాల్ చాంపియన్‌షిప్ సాధించారు. భద్రాచలం ఐటీడీఏ పరిధిలోని విద్యార్థులు రెండో స్థానంలో నిలిచారు. – పాల్వంచరూరల్ 10లో



ఉట్నూరు విద్యార్థులకు బహుమతి అందజేస్తున్న ఎమ్మెల్యే, పీఓ

క్లుప్తంగా

ఇల్లెందుకు ఓడీఎఫ్ డబుల్ ప్లస్

అవార్డు ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం



మున్సిపల్ కమిషనర్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య తదితరులు

ఇల్లెందు: కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన అవార్డుల్లో ఇల్లెందు మున్సిపాలిటీకి ఓడీఎఫ్ విభాగంలో డబుల్ ప్లస్ అవార్డు దక్కింది. ఇల్లెందుకు గతంలో హరితహారం, స్వచ్ఛ సర్వేక్షణ్, టాయిలెట్ల నిర్మాణంలో రాష్ట్రస్థాయి అవార్డులు దక్కిన విషయం విదితమే. తాజాగా కేంద్రం నాలుగు విభాగాలకు అవార్డులు ప్రకటించగా, ఇల్లెందుకు ఓడీఎఫ్ డబుల్ ప్లస్ సర్టిఫికెట్ దక్కింది. త్వరలో రాష్ట్రపతి చేతులమీదుగా ఈ అవార్డు ధ్రువ పత్రం అందుకోనున్నారు. ఉమ్మడి జిల్లాలో ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌తోపాటు ఇల్లెందుకు మాత్రమే అవార్డులు వరించాయి. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ నవీన్‌ను, ఎన్వీరాన్‌మెంట్ అధికారి అక్తర్, కంప్యూటర్ ఆపరేటర్ గణేష్‌లను ఎమ్మెల్యే కోరం కనకయ్య, మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, తదితరులు అభినందించారు. శాలువాతో సత్కరించారు. మేనేజర్ అంకుషావలీ, కౌన్సిలర్లు వారా రవి, అంకెపాక నవీన్, ఈశ్వర్, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

ఐటీడీఏ గురుకులం సెల్ ఏఓ సస్పెన్షన్

భద్రాచలం: భద్రాచలం ఐటీడీఏలోని గురుకులం సెల్‌లో విధులు నిర్వర్తిస్తున్న అడ్మినిస్ట్రేటివ్ అధికారి నరేందర్‌ను సస్పెండ్ చేస్తూ భద్రాచలం ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఐటీడీఏ పరిధిలోని పాఠశాలల్లోని విద్యార్థులకు యూనిఫామ్ నిమిత్తం డ్రెస్ మెటీరియల్ వచ్చింది. అయితే యూనిఫామ్ కుట్టు పనులు సకాలంలో పూర్తిచేయలేదు. దీంతో విద్యార్థులకు యూనిఫామ్ అందకపోవడంతో పలువురు పీఓకు ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టగా విధుల్లో అలసత్వం వహించినట్లు తేలడంతో నరేందర్‌ను సస్పెండ్ చేసినట్లు ప్రకటించారు.

ఓవర్‌లోడ్ ట్రాక్టర్లపై కేసు నమోదు



వివరాలు వెల్లడిస్తున్న ఎంవీఐ తిరుపతి

బూర్గంపాడు: ఓవర్‌లోడ్‌తో కర్ర రవాణా చేస్తున్న రెండు ట్రాక్టర్లను మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ తిరుపతి శనివారం పట్టుకున్నారు. సారపాకలోని ఐటీసీ పీఎస్‌పీడీకి జమాయిల్ కర్రతో వెళ్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకుని ఓవర్‌లోడ్ ఉన్నట్లు గుర్తించారు. రెండు ట్రాక్టర్లను డిపోకు తరలించి కేసులు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. ఓవర్‌లోడ్ కారణంగా ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, అందువల్ల ఎట్టి పరిస్థితుల్లోనూ పరిమితికి మించి సరుకు లోడ్ చేయొద్దని హెచ్చరించారు.

రోడ్డు ప్రమాద ఘటనలో...

అశ్వాపురం: మండల కేంద్రంలోని టీడీపీ సెంటర్‌లో గత అక్టోబర్ 18న జరిగిన రోడ్డు ప్రమాదంపై శనివారం అశ్వాపురం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. మణుగూరు మండలంలోని సమితిసింగారానికి చెందిన ప్రైవేటు ఉద్యోగి ఆంబోజు సంపత్ ద్విచక్రవాహనంపై వెళ్తుండగా, గద్దల లక్ష్మణరావు మరో ద్విచక్రవాహనంపై ఎదురుగా వచ్చి ఢీకొట్టాడు. దీంతో సంపత్‌కు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడు ఆస్పత్రిలో చికిత్స పొందిన అనంతరం శనివారం ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


టేకు దిమ్మెలు స్వాధీనం



అటవీశాఖ అధికారులు పట్టుకున్న టేకు దిమ్మెలు

దుమ్ముగూడెం : మండలంలోని దుమ్ముగూడెం గోదావరి ఫెర్రీ పాయింట్ దగ్గర అటవీశాఖ అధికారులు శుక్రవారం అర్ధరాత్రి 8 టేకు దిమ్మెలను, ఆటో, మూడు ద్విచక్ర వాహనాలను పట్టుకున్నారు. రాత్రి సమయంలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న అటవీశాఖ సిబ్బంది గోదావరి దాటించడానికి సిద్ధంగా ఉంచిన టేకు దిమ్మెలను గమనించారు. వాహనాలతో సహా కలపను స్వాధీనం చేసుకుని రేంజ్ కార్యాలయానికి తరలించారు. పట్టుకున్న కలప విలువ సుమారు రూ.లక్ష ఉంటుందని అంచనా. ఈ దాడిలో డీఆర్వో జి.శోభన్, ఎఫ్‌బీఓలు ఎస్.రాజేష్ , ఎం.వెంకటరత్నం, బి.విజయ, బి.భీముడు, జి.సతీష్ పాల్గొన్నారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.12,448

బిల్లులు చెల్లించరు.. వేతనాలు ఇవ్వరు

- ప్రభుత్వ పాఠశాలల్లోని మిడ్డే మీల్స్ వర్కర్ల అవస్థలు
- గ్యాస్, కోడిగుడ్ల బిల్లులూ మంజూరు చేయడం లేదని ఆవేదన
- సరుకులు ఇవ్వకపోవడంతో భారంగా మారిన 'అల్పాహారం'
- ఆందోళన బాట పట్టిన మధ్యాహ్న భోజన కార్మికులు



మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్న కార్మికులు (ఫైల్)

కొత్తగూడెంఅర్బన్: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న మిడ్డే మీల్స్(మధ్యాహ్న భోజన పథకం) కార్మికులకు వేతనాలు, బిల్లులు విడుదల కావడం లేదు. ఐదు, ఆరు నెలలకోసారి కూడా ఇవ్వకపోవడంతో కార్మికులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ఆందోళన బాటపట్టారు. మండల స్థాయిలో ఇప్పటికే ఎంఈఓలకు వినతి పత్రాలు అందించారు. ఈ నెల 8న కలెక్టరేట్ ముట్టడికి ప్రణాళికలు చేసుకుంటున్నారు. కార్మికులు నిరసనలు చేపడుతుండగా, పాఠశాలల్లో ఉదయం వేళల్లో పౌష్టికాహారం, మధ్యాహ్నం భోజన పథకాలకు కొంత అవాంతరాలు ఏర్పడుతున్నాయి.

ఆగస్టు నుంచి వేతనాలు పెండింగే..

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో 2,100 మంది వరకు మిడ్డే మీల్స్ వర్కర్లు పని చేస్తున్నారు. వీరికి గతంలో రూ.1000 వేతనం ఇచ్చేవారు. గత జూలైలో అప్పటి ప్రభుత్వం రూ.2000 వేతనం ఇస్తున్నట్లు ప్రకటించి అమలు చేపట్టింది. అయితే జిల్లాలోని వంద పాఠశాలల్లో పని చేస్తున్న కార్మికులకు పెరిగిన వేతనం ఇప్పటివరకు విడుదల కాలేదు. ఇక ఆగస్టు నుంచి జిల్లాలోని కార్మికులందరికీ వేతనాలు ఇవ్వడంలేదు. సెప్టెంబర్ నుంచి గుడ్డు బిల్లులు కూడా పెండింగ్‌లో ఉన్నాయి. సొంత ఖర్చులతో కూరగాయలు, వంట సామగ్రిని తీసుకురావడం కష్టతరంగా మారుతోందని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తెచ్చిన అప్పులకు వడ్డీలు పెరిగిపోతున్నాయని వాపోతున్నారు.

గుడ్డు ధర రూ.7.., చెల్లించేది రూ.5

మధ్యాహ్న భోజనంలో గుడ్డు వడ్డిస్తుండగా, ప్రభుత్వం గుడ్డుకు రూ.5 మాత్రమే చెల్లిస్తోంది. ప్రస్తుతం మార్కెట్‌లో గుడ్డు ధర రూ.7, రూ.8 వరకు ఉంది. దీంతో ఒక్కో గుడ్డుకు రెండు, మూడు రూపాయలు నష్టపోవాల్సి వస్తోందని కార్మికులు పేర్కొంటున్నారు. అసలే చాలీచాలని వేతనాలు, అవి రెగ్యులర్‌గా ఇవ్వరు. దీనికితోడు గుడ్డు భారంతో అవస్థలు తప్పడంలేదు. ఈ సమస్యలను పలుమార్లు జిల్లా విద్యాధికారులకు విన్నవించినా ప్రయోజనం లేదని ఆవేదన చెందుతున్నారు. వీరికి తోడు డీఈఓ కార్యాలయంలో పని చేస్తున్న సీఆర్పీలు, డాటా ఎంట్రీ ఆపరేటర్లు, ఎంఐఎస్ కో–ఆర్డినేటర్లు, సెక్టోరియల్ అధికారులకు, కార్యాలయ రెగ్యులర్ సిబ్బందికి సైతం రెండు నెలలుగా వేతనాలు విడుదల కాలేదు. దీంతో వారుకూడా నల్లబ్యాడ్జీలు ధరించి నిరసనలు తెలుపుతున్నారు.

అల్పాహార పథకంతో ఆర్థికభారం

గత రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అల్పాహారం పథకానికి సంబంధించి ప్రభుత్వం నుంచి ముడి సరుకులు ఇవ్వలేదు. దీంతో కార్మికులు, ఉపాధ్యాయులే సొంత డబ్బులు వెచ్చించి సరుకులు కొనుగోలు చేసి ఉదయం టిఫిన్ ఏర్పాటు చేశారు. సరుకుల కొనుగోలు భారంగా మారడంతో పాఠశాలల్లో అల్పాహారం పథకం సక్రమంగా అమలు కావడంలేదు. ప్రస్తుత ప్రభుత్వం ఆ పథకం అమలు చేస్తుందో? లేదోననే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

వేతనాలు సకాలంలో రావట్లే..



మిడ్డే మీల్స్ వర్కర్లకు వేతనాలు రెగ్యులర్‌గా రావడం లేదు. ప్రతి సారి ఐదు నెలలు ఆగాల్సివస్తోంది. వీటికి తోడు ఎగ్, గ్యాస్ బిల్లుల చెల్లింపులో కూడా జాప్యం జరుగుతోంది. జిల్లా విద్యాశాఖాధికారులు స్పందించి ప్రతి నెలా వేతనాలు, బిల్లులు చెల్లించాలి.

–సత్తెనపల్లి విజయలక్ష్మి, మిడ్డేమీల్స్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి

చర్యలు తీసుకుంటాం



మిడ్డే మీల్స్ వర్కర్లకు సంబంధించిన వేతనాలు, ఇతర బిల్లుల మంజూరుకు చర్యలు చేపడతాం. వేతనాలు, బిల్లులు రెగ్యులర్‌గా వచ్చేలా ఉన్నతాధికారులకు విన్నవిస్తాం. ఎగ్‌కు మార్కెట్ ధర చెల్లించేందుకు కృషి చేస్తాం.

–ఎం.వెంకటేశ్వరాచారి, జిల్లా విద్యాధికారి

రిజిస్ట్రేషన్ ప్రక్రియపై దృష్టి సారించండి

కలెక్టర్‌ను కోరిన ఎమ్మెల్యే కూనంనేని



కలెక్టర్ ప్రియాంకతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

పాల్వంచ : పాల్వంచ పట్టణంలో రిజిస్ట్రేషన్ ప్రక్రియపై దృష్టి సారించాలని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు కోరారు. శనివారం ఆయన కలెక్టరేట్‌లో కలెక్టర్ ప్రియాంక అలను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మాట్లాడుతూ సర్వే నంబర్ 444, 817, 727, 999 భూముల్లో రిజిస్ట్రేషన్ నిలిచిపోయిందని, దీని వల్ల గృహ, స్థల యజమానులు ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. సాంకేతిక సమస్యలను త్వరితగతిన అధిగమించి రిజిస్ట్రేషన్‌ను ప్రారంభించాలని కోరారు. జిల్లాలో ప్రజాపాలన గ్రామ సభలు విజయవంతంగా నిర్వహించడం పట్ల అభినందనలు తెలిపారు. ఇళ్ల స్థలాలు, డబుల్ బెడ్ రూం ఇళ్లు, నిర్వాసితులకు కేటాయించిన స్థలాల కేటాయింపు ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేసి లబ్ధిదారులకు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా పాల్గొన్నారు.

11 నుంచి టీపీటీఎఫ్ సభలు

ఖమ్మంసహకారనగర్: వచ్చే నెల 11, 12వ తేదీల్లో ఖమ్మంలో తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టీపీటీఎఫ్) రాష్ట్ర ద్వితీయ విద్యా వైజ్ఞానిక మహాసభలు నిర్వహించనున్నట్లు మహాసభల ఆహ్వాన సంఘం అధ్యక్షుడు ప్రొఫెసర్ కె.లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. ఖమ్మంలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. టీపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.నాగిరెడ్డి, ఏవీ నాగేశ్వరరావు, ఎస్.విజయ్ తదితరులు పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

కొత్తగూడెంఅర్బన్: పట్టణ పరిధిలోని మధురబస్తీలో శనివారం రాత్రి ప్రమాదవశాత్తు షార్ట్ సర్క్యూట్ కావడంతో ఓ ఇల్లు దగ్ధమైంది. మధుర బస్తీకి చెందిన సాయికుమార్ ఇంట్లో ఈ ప్రమాదం జరగగా ఇంట్లోని వస్తువులు, ఫర్నిచర్ కాలిపోయాయి. స్థానికులు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించగా సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని మంటలను ఆర్పారు. కాగా, రూ.లక్షల విలువైన సామగ్రి దగ్ధమైనట్లు అగ్నిమాపక శాఖ అధికారులు అంచనా వేశారు.

టిప్పర్‌ను ఢీకొట్టిన ప్రైవేట్ స్కూల్ బస్సు

10 మందికి పైగా విద్యార్థులకు గాయాలు

రఘునాథపాలెం: మండలంలోని చింతగుర్తిలో ఓ ప్రైవేట్ పాఠశాల బస్సు ఎదురుగా వస్తున్న టిప్పర్‌ను ఢీకొట్టగా, 10 మందికి పైగా విద్యార్థులు గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. రఘునాథపాలెం సీఐ శ్రీధర్ కథనం ప్రకారం.. రోజులాగే శనివారం విద్యార్థులతో వెళ్తున్న బస్సు ఎదురుగా వచ్చిన టిప్పర్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో విద్యార్థులు గాయాలతో బయటపడగా ఊపిరి పీల్చుకున్నారు. కాగా, విద్యార్థులు ఆందోళనకు గురికాగా, సమాచారం తెలుసుకున్న తల్లిదండ్రులు, గ్రామస్తులు చేరుకుని వివరాలు ఆరా తీశారు. బస్సు డ్రైవర్ సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడంతోనే ప్రమాదం జరిగినట్లు తెలిసింది. డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. రహదారిపై కుడివైపునకు దూసుకు వచ్చిన బస్సును చూసి టిప్పర్ డ్రైవర్ సమయస్ఫూర్తితో వాహనాన్ని పక్కకి తీసుకెళ్లడంతో పెను ప్రమాదం తప్పినట్లయింది. కాగా, స్కూల్ బస్సు టిప్పర్‌తో పాటు రహదారి పక్కన నిలిపి ఉంచిన రెండు బైక్‌లను ఢీకొట్టగా అవి ధ్వంసమయ్యాయి.

పత్తి తూకంలో మోసం

వ్యాపారిపై పోలీసులకు ఫిర్యాదు చేసిన రైతులు

చర్ల: పత్తి వ్యాపారి తమను తూకంలో మోసం చేశాడంటూ దోశిళ్లపల్లికి చెందిన గిరిజనులు శనివారం చర్ల పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు. పాల్వంచ సమీపంలోని ఓ గ్రామానికి చెందిన వ్యాపారి చర్ల మండలంలోని దోశిళ్లపల్లిలో సుమారు 10 రోజుల క్రితం కొందరి రైతుల వద్ద పత్తిని కొనుగోలు చేసి డబ్బులు చెల్లించి వెళ్లాడు. మళ్లీ రెండోసారి అదే గ్రామంలో పత్తి కొనుగోలు చేసేందుకు శుక్రవారం ఉదయం వచ్చాడు. రామకృష్ణ అనే రైతు వద్ద పత్తి కొనేందుకు ఎలక్ట్రానిక్ కాంటా ద్వారా తూకం వేయగా 4 క్వింటాళ్ల 20 కిలోలు వచ్చింది. అయితే 5 క్వింటాళ్ల తూకం రావాల్సిన పత్తి, తక్కువ రావడంతో అనుమానం వచ్చిన రైతు కాంటాను, వ్యాపారి వద్ద ఉన్న మొబైల్‌ఫోన్‌ను పరిశీలించారు. బ్లూటూత్ ద్వారా ఎలక్ట్రానిక్ కాంటాను ఆపరేట్ చేస్తూ, తూకంలో మోసం చేస్తున్నట్లు గుర్తించాడు. నిలదీయడంతో వ్యాపారి అక్కడి నుంచి పత్తి కొనకుండానే వెళ్లిపోయాడు. కాగా గతంలో ఇదే వ్యాపారికి పత్తి విక్రయించిన రైతులు తాము కూడా మోసపోయామంటూ శనివారం సాయంత్రం చర్ల పోలీసులకు ఫిర్యాదు చేశారు.

గోడుగుబండ అడవిలో పెద్దపులి సంచారం!



కరకగూడెం: మండలంలోని సమత్ మోతె గ్రామ పంచాయతీ పరిధిలోని గోడుగుబండ, పాతపాడు అటవీప్రాంతాల్లో పెద్దపులి అరుపులు విని రైతులు భయాందోళనతో పరుగులు తీశారు. శనివారం గొడుగుబండ, చిలకలసింగారం గ్రామాల రైతులు పోడు భూముల్లో పత్తి తీసేందుకు వెళ్లారు. ఈ క్రమంలో అటవీ ప్రాంతంలో పెద్దపులి అరుపులు వినపడంతో అడుగులు సైతం వారికి కనిపించడంతో వారు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని గ్రామాలకు పరుగు తీశారు. కాగా ఈ విషయమై అనంతారం ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ గోవింద్‌ను వివరణ కోరగా.. పులి సంచరిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, ఆదివారం వెళ్లి ఆనవాళ్లను పరిశీలిస్తామని తెలిపారు. పాదముద్రలు సేకరిస్తామని పేర్కొన్నారు.

జ్యూయలరీ షాపు ఎదుట ఆందోళన

- రూ.75 లక్షల అప్పు తీసుకుని మోసం చేశాడని బాధితుల ఆరోపణ
- పరస్పరం దాడి చేసుకోవడంతో గాయాలు



షాపు ముందు ధర్నా చేస్తున్న బాధితులు

పాల్వంచ: జ్యూయలరీ షాపు నిర్వాహకుడు అప్పుగా తీసుకున్న నగదు ఇవ్వకుండా మోసం చేశాడని బాధితులు శనివారం ధర్నా చేపట్టారు. ఈ క్రమంలో ఒకరిపై ఒకరు దాడి చేసుకోగా, గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. పట్టణంలోని శాస్త్రిరోడ్‌లో ఉన్న ధనలక్ష్మి జ్యూలయరీ షాపు నిర్వాహకుడు లంక రాము తమకు రూ.75 లక్షల నగదు ఇవ్వాలంటూ షాపు ఎదుట కొంచాడ కృష్ణ అనే వ్యక్తితోపాటు అతని భార్య స్వాతి, కుటుంబ సభ్యులు ధర్నా చేపట్టారు. షాపు అభివృద్ధికి పెట్టుబడి కింద తీసుకుని, తరుగు, మజూరి లేకుండా బంగారు ఆభరణాలు ఇస్తానని నమ్మబలికాడని ఆరోపించారు. ఈ క్రమంలో షాపులోకి వెళ్లి పరస్పరం దాడులు చేసుకున్నారు. దీంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఈ ఘటనలో కృష్ణ కుటుంబ సభ్యులు సంతోష్, విజయతోపాటు షాపు నిర్వాహకుడు రాముకు గాయాలయ్యాయి. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ గతంలో రాము, అతని సోదరుడికి మధ్య ఆర్థిక లావాదేవీల విషయంలో గొడవ జరగ్గా రూ.35లక్షలు ఇచ్చామని, తర్వాత వ్యాపార అభివృద్ధి నిమిత్తం మరో రూ.40లక్షలు ఇచ్చామని, ఈ వ్యవహారంపై పెద్దమనుషులు పంచాయితీ చేస్తున్నారని తెలిపారు. డబ్బులు ఎప్పుడు అడిగినా తమను భయభ్రాంతులకు గురి చేస్తుండటంతో విసిగిపోయి షాపు ముందు బైఠాయించామని పేర్కొన్నారు. డబ్బులు ఇచ్చే వరకు షాపు ముందు నుంచి కదలబోమని భీష్మించారు. ఎస్‌ఐలు బి.రాము, రాఘవయ్యలు అక్కడికి చేరుకుని ధర్నా చేస్తున్న వారిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా ఇరువర్గాల నుంచి ఫిర్యాదులు తీసుకుని కేసులు నమోదు చేయనున్నట్లు పోలీసులు తెలిపారు.

క్వింటా గంజాయి స్వాధీనం?

భద్రాచలంటౌన్: భద్రాచలంలో ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ అధికారులు శనివారం భారీగా గంజాయిని పట్టుకున్నట్లు సమాచారం. పట్టణంలోని పలు చోట్ల తనిఖీలు నిర్వహించారు. ఓ వ్యాన్‌లో టామాట ట్రేల మాటున గంజాయిని తరలిస్తుండగా బ్రిడ్జి సెంటర్‌లోని ఫారెస్ట్ చెక్ పోస్ట్ వద్ద గుర్తించి పట్టుకున్నట్లు తెలిసింది. సుమారు క్వింటా గంజాయి పట్టుకున్నట్లు సమాచారం.

భార్యను గొడ్డలితో నరికి చంపిన భర్త

- వివాహేతర సంబంధాన్ని ప్రశ్నించడంతో ఆగ్రహం
- పదేళ్ల కిందట ప్రేమించి పెళ్లి చేసుకున్న నిందితుడు



ఆదిలక్ష్మి, వీరన్న (ఫైల్)

రఘునాథపాలెం: ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు.. ఆపై కొన్నాళ్లు దాంపత్య జీవనం సజావుగా సాగింది.. ఇంతలోనే ఆయన జీవితంలోకి మరో మహిళ ప్రవేశించింది.. ఈ వివాహేతర సంబంధంపై ప్రశ్నించిన భార్యను అతి కిరాతకంగా గొడ్డలితో నరికి హత్య చేశాడు. రఘునాథపాలెం మండలం శివాయిగూడెంలో శనివారం జరిగిన ఈ ఘటన వివరాలు సీఐ శ్రీధర్ కథనం ప్రకారం.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలం పూసుపల్లి గ్రామానికి చెందిన ఆదిలక్ష్మి (26)ని శివాయిగూడెంనకు చెందిన టిప్పర్ డ్రైవర్ మూడ్ వీరన్న పదేళ్ల కిందట ప్రేమించాడు. బంధువులే కావడంతో ఇరు కుటుంబాలు ఒప్పుకొని వివాహం జరిపించారు. కొన్నాళ్లు సజావుగా కాపురం సాగగా వీరికి ముగ్గురు పిల్లలు జన్మించారు. కొంతకాలంగా వీరన్న అదే గ్రామానికి చెందిన మరో మహిళతో వివాహేతర సంబంధం నెరుపుతూ మూడు నెలల కిందట ఆమెతో వెళ్లిపోయాడు. కొన్నాళ్లకు తిరిగి రావడంతో పెద్దలు పంచాయితీ నిర్వహించగా ఇక నుంచి ఆదిలక్ష్మితోనే ఉంటానని నమ్మబలికిన వీరన్న ఆమెను పుట్టింటి నుంచి తీసుకొచ్చాడు. కానీ కొద్దిరోజులకే పరిస్థితి మొదటికి రాగా భార్యను అనుమానించడం మొదలుపెట్టాడు. ఎవరితో ఫోన్ మాట్లాడినా అనుమానించడంతో వీరన్న – ఆదిలక్ష్మి నడుమ ఘర్షణ జరుగుతోంది. ఈ క్రమంలో శనివారం కూడా మొదలైన గొడవ పెద్దది కావడంతో ఆదిలక్ష్మిని ఆయన గొడ్డలితో దారుణంగా నరికి హత్యచేశాక పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయాడు. దీంతో ఖమ్మం ఏసీపీ హరికృష్ణ, రఘునాథపాలెం సీఐ శ్రీధర్ ఘటనాస్థలికి చేరుకుని కేసు దర్యాప్తు చేపట్టారు.

మళ్లీ రాజుకున్న స్థల వివాదం

ఇల్లెందురూరల్: మండలంలోని చల్ల సముద్రం గ్రామపంచాయతీ పరిధిలోని వేములవాడ డబుల్ బెడ్ రూం ఇళ్ల స్థలాల వివాదం శనివారం మళ్లీ రాజుకుంది. డబుల్ బెడ్‌రూం ఇళ్ల కోసం కొనుగోలు చేసిన స్థలంలో ఇళ్ల నిర్మాణం పోను మిగతా ఖాళీ స్థలాన్ని ఇతరులకు విక్రయించారనే ఆరోపణపై ఐదేళ్ల క్రితం వివాదం చోటుచేసుకుంది. ఇరువర్గాలు పోలీసుస్టేషన్ మెట్లు ఎక్కడంతో సమస్య క్రమంగా సమసిపోయింది. మళ్లీ శనివారం ఖాళీ స్థలంలో ఇంటి నిర్మాణం కోసం పిల్లర్లు వేసుకున్న వ్యక్తి నేలను చదును చేసుకునేందుకు డోజర్‌తో అక్కడికి రావడంతో డబుల్ బెడ్‌రూం ఇళ్ల లబ్ధిదారులు అడ్డుపడ్డారు. దీంతో అక్కడే ఉన్న సర్పంచ్ తాటి చుక్కమ్మ వారితో ఘర్షణకు దిగారు. ఇరువర్గాల మధ్య వాగ్వాదం నెలకొంది. కొద్దిసేపటి తర్వాత ఎవరికి వారు అక్కడి నుంచి వెళ్లిపోవడంతో వివాదం తాత్కాలికంగా నిలిచిపోయింది.

లారీకింద పడి హమాలీ మృతి

దుమ్ముగూడెం : డీసీఎం లారీ కింద పడి హమాలీ కార్మికుడు మృతి చెందిన సంఘటన మండలంలోని చెరుపల్లి గ్రామంలో శనివారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. భద్రాచలంలోని తుమ్మలనగరానికి చెందిన హమాలీ కార్మికుడు పేరాల శేఖర్ పత్తి లోడ్ చేసేందుకు గ్రామస్తులతో కలిసి మారాయిగూడెం గ్రామం బయల్దేరారు. కొందరు కార్మికులు డీసీఎం లారీ కేబిన్‌లో కూర్చోగా, శేఖర్‌తోపాటు మరో ఇద్దరు కార్మికులు కేబిన్‌పై కూర్చున్నారు. డ్రైవర్ అతి వేగంగా, నిర్లక్ష్యంతో లారీ నడపడంతోపాటు చెరుపల్లి సెంటర్ మలుపు వద్ద వేగం తగ్గించకుండా టర్నింగ్ తీసుకున్నాడు. దీంతో శేఖర్ అదుపుతప్పి కింద పడ్డాడు. లారీ టైరు అతనిపైనుంచి పోవడంతో తీవ్రగాయాలై మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు ఏఎస్‌ఐ సత్యనారాయణ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గాయపడిన వ్యక్తి...

బూర్గంపాడు: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న వ్యక్తి శుక్రవారం అర్ధరాత్రి మృతిచెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. గత నెల 24న బూర్గంపాడు కొల్లుచెరువు సమీపంలో రోడ్డు పక్కన నిలిపి ఉన్న టాటా ఏస్ వాహనాన్ని మోటార్‌సైకిల్ ఢీ కొట్టింది. ఈ ఘటనలో మోటార్ సైకిల్‌పై ఉన్న పాల్వంచ మండలం గంగదేవిగుప్ప గ్రామానికి చెందిన అన్నదమ్ములు కృష్ణ, రాము తీవ్రంగా గాయపడ్డారు. వీరిని స్థానికులు భద్రాచలం ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న క్రమంలో కృష్ణ ఆరోగ్య పరిస్థితి విషమించి శుక్రవారం అర్ధరాత్రి మృతిచెందాడు. మృతుడి భార్య పద్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అశ్వాపురంలో మహిళ...

అశ్వాపురం: మండల పరిధిలోని అంబేద్కర్‌నగర్‌లో గ్రామం వద్ద గత నెల 28న జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ మహిళ ఖమ్మంలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది. పోలీసుల కథనం ప్రకారం... అంబేద్కర్ నగర్ గ్రామానికి చెందిన రాంపూడి సోమమ్మ (70)ను తన కుమారుడు రాంబాబు ద్విచక్రవాహనంపై తీసుకెళ్తుండగా, ద్విచక్రవాహనం అదుపు తప్పి కింద పడి సోమమ్మకు తీవ్ర గాయాలయ్యాయి. ఖమ్మంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది. రాంబాబు అజాగ్రత్తగా ద్విచక్రవాహనం నడపడం వల్ల ప్రమాదం జరిగిందంటూ, రాంబాబు కుమారుడు సాయికిరణ్ ఫిర్యాదు చేయగా.. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఫారెస్టు ప్లాంటేషన్ ధ్వంసంపై విచారణ

కారేపల్లి: కారేపల్లి ఫారెస్ట్ రేంజ్ పరిధి ఎర్రబోడు సమీపాన ఊటవాగు వద్ద వేసిన ఫారెస్టు ప్లాంటేషన్‌ను గుర్తుతెలియని వ్యక్తులు శనివారం నరికివేశారు. ఈ మేరకు సమాచారం అందుకున్న కారేపల్లి అటవీ సిబ్బంది చేరుకుని విచారణ చేపట్టారు. ఇదిలా ఉండగా కొన్నాళ్ల కిందట ఊటవాగు వద్ద సుమారు 30 ఎకరాల విస్తీర్ణంలో కొందరు పోడు వ్యవసాయం చేస్తుండగా.. అటవీ అధికారులు అడ్డుకుని ప్లాంటేషన్ వేశారు. దీంతో కొందరు పోడురైతులు ఫారెస్టు అధికారులు నాటిన మొక్కలను ధ్వంసం చేయగా అప్పట్లో కేసులు నమోదయ్యాయి. మళ్లీ ఊటవాగు ప్రాంతంలోనే ప్లాంటేషన్‌ను ధ్వంసం చేయటంతో సదరు పోడు రైతులను విచారిస్తున్నట్లు తెలిసింది.

క్లుప్తంగా...



తిరుమల శ్రీవారిని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రాజేష్ బిందాల్(పై చిత్రం), తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నగేశ్ శనివారం దర్శించుకున్నారు.



దరిగాం అడవుల్లో పులి హతం?

కాగజ్‌నగర్‌రూరల్: కుమురంభీం జిల్లా కాగజ్ నగర్ మండలం దరిగాం అటవీ ప్రాంతంలో శనివారం పులి హతమైనట్లు తెలిసింది. రెండు పులుల మధ్య జరిగిన ఘర్షణలో ఆడపులి మృతిచెందినట్లు తెలిసింది. దరిగాం అటవీ ప్రాంతం దట్టంగానూ, ఆవాసానికి అనుకూలంగానూ ఉండడంతో ఇక్కడ పులుల సంచారం ఎక్కువగా ఉంటుంది. ఈ క్రమంలోనే పోటీతత్వంతో రెండు పులుల మధ్య ఘర్షణ జరిగినట్లు ఫారెస్టు అధికారులు భావిస్తున్నారు. అయితే, ఈ విషయమై వివరాలు వెల్లడించే విషయంలో గోప్యంగా వ్యవహరిస్తున్నారు.

పొద్దుపొద్దునే ప్రయాణాలొద్దు!

▶ మొదటి పేజీ తరువాయి

పోలీసులు తెలిపారు.

- 25 డిసెంబర్, 2023న నల్లగొండ జిల్లా నిడమనూరు మండలం వేంపాడు వద్ద రాత్రి 10 గంటలకు జరిగిన రోడ్డు ప్రమాదంలో 19 ఏండ్ల యువకుడు రమావత్ శివనాయక్ ద్విచక్రవాహనంతో 55 ఏండ్ల బల్లూరి సైదులు అనే వ్యక్తిని ఢీకొట్టిన ప్రమాదంలో ఇద్దరూ మృతి చెందారు. ఈ సమాచారం తెలుసుకున్న మృతుడు శివనాయక్ బంధువులు టాటాఏస్ వాహనంలో ప్రమాద ఘటన స్థలానికి బయలుదేరారు. తెల్లవారుజామున 3గంటల సమయంలో వారు ప్రయాణిస్తున్న టాటాఏస్ వాహనాన్ని ఎదురుగా వస్తున్న ఆయిల్ ట్యాంకర్ నిడమనూరు మండలం 3వ నంబర్ కెనాల్ వద్ద ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నలుగురు మృతిచెందారు. దట్టమైన పొగమంచు కారణంగానే ఈ వరుస ప్రమాదాలు జరిగినట్టు పోలీసులు పేర్కొన్నారు.
- డిసెంబర్ 31న తెల్లవారుజామున జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆర్టీసీ బస్సు, డీసీఎం ఎదురెదురుగా వస్తూ ఢీకొన్న ప్రమాదంలో డీసీఎం డ్రైవర్ చనిపోగా, ఆర్టీసీ బస్ డ్రైవర్‌తోపాటు ఆ బస్సులోని మరో 10మంది ప్రయాణికులు తీవ్రంగా గాయపడ్డారు. పొగమంచుతో రోడ్డు సరిగా కనిపించకపోవడంతోనే ప్రమాదం జరిగినట్టు తెలిపారు.
- డిసెంబర్ 25న హైదరాబాద్ నుంచి వికారాబాద్ జిల్లా అనంతగిరి ఔటింగ్‌కు వెళ్లి తిరిగి వస్తున్న మిత్రుల బృందం కారు పొగమంచు కారణంగా రోడ్డు పక్కన ఉన్న శివారెడ్డిపేట్ చెరువులోకి దూసుకెళ్లింది. కారులో ఉన్న ఒకరు గల్లంతు కాగా, మిగిలిన నలుగురిని స్థానికులు కాపాడారు.

ప్రయాణం తప్పనిసరైతే ఇవి మరవొద్దు

- పొగమంచు కురుస్తున్నప్పుడు మీకు కేటాయించిన లేన్‌లోనే వాహనం నడపాలి. వీలైనంత వరకు ఓవర్‌టేక్ చేయకపోవడమే ఉత్తమం.
- సింగిల్ రోడ్డులో వాహనం నడపాల్సి వస్తే.. వీలైనంత వరకు మీ వాహనం ఎడమవైపు ఉండేలా చూసుకోవాలి.
- డ్రైవింగ్ సమయంలో ఏ సంశయం ఉన్నా.. రోడ్డు పూర్తిగా కనిపించకపోయినా మీ వాహనాన్ని రోడ్డు పక్కకు నిలపడమే ఉత్తమం. మీరు వాహనాన్ని పార్క్ చేసినట్టుగా సూచిస్తూ పార్కింగ్ లైట్లు వేయాలి.
- పొగమంచు వాతావరణం ఉన్నప్పుడు వాహన వేగాన్ని వీలైనంత వరకు తక్కువగా ఉండేలా చూసుకోవాలి. ఎదుటి వాహనం కనిపించని పరిస్థితుల్లో వేగంగా వెళితే వాహనాన్ని కంట్రోల్ చేయడం కష్టం. అదేవిధంగా ప్రమాద తీవ్రత పెరిగే అవకాశం ఉంటుంది.
- పొగమంచు కురుస్తున్నప్పుడు డ్రైవర్లు సాధారణంగా హైబీంలో లైట్లు పెడతారు. ఇలా చేయడం వల్ల రిఫ్లెక్షన్ వల్ల డ్రైవర్‌కు సరిగా కనిపించదు. విజిబిలిటి 100 మీటర్లలోపు ఉన్నట్లయితే హెడ్‌లైట్లు లోబీంలో ఉంచాలి. మీ వాహనానికి ఫాగ్ ల్యాంప్‌లు ఉంటే వాటిని తప్పక ఆన్ చేయాలి.
- ఎదుటి వాహనదారుడిని అప్రమత్తం చేసేలా మీ వాహనానికి ఇండికేటర్లు వేసు కుని వెళ్లడం ఉత్తమం.
- మీ వాహన అద్దాలు వీలైనంత వరకు శుభ్రంగా ఉండేలా చూసుకోవాలి. మీ కారులోని డీఫాగర్‌ను ఆన్ చేసుకోవాలి.
- వీలైనంత వరకు ఎదురుగా ఉన్న రోడ్డు స్పష్టంగా కనిపించేలా అవసరం మేరకు డ్రైవింగ్ సీట్‌ను సర్దుబాటు చేసుకోవాలి.
- పొగమంచు ఉన్నప్పుడు వాహనం ఒక్క క్షణం అదుపు తప్పి పెను ప్రమాదం జరిగే అవకాశం ఉంటుంది. కాబట్టి డ్రైవింగ్‌పైనే దృష్టి పెట్టాలి. నిద్రమత్తు లేకుండా జాగ్రత్త పడాలి.
- వాహనం పూర్తి కండిషన్‌లో ఉండేలా చూసుకోవాలి. టైర్లు, బ్రేక్‌లు ముందుగానే చెక్ చేసుకోవాలి. మీ కారులోని హీటర్ ఆన్ చేయాలి. దీనివల్ల బయటి పొగమంచుతో అద్దంపై ప్రభావం లేకుండా ఉంటుంది.
- లేన్ మారుతున్నప్పుడు, మూల మలుపుల వద్ద తప్పకుండా హారన్ మోగించాలి.
- మొబైల్ ఫోన్ వాడడం, రేడియోలో ఎఫ్ఎం వినడం, పాటలు వింటూ డ్రైవ్ చేయవద్దు.

కాంగ్రెస్‌లో షర్మిల చేరడం వెనుక చంద్రబాబు కుట్ర

- అధికారం ఇక కలే అని గ్రహించిన టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు
- దింపుడుకళ్లం ఆశలతో రకరకాల కుట్రలు
- సంక్షేమ పాలన నుంచి ప్రజల దృష్టి మళ్లించే ప్రయత్నం
- కాంగ్రెస్‌కు గత ఎన్నికల్లో నోటా కంటే తక్కువ ఓట్లు
- ఉనికిలోలేని కాంగ్రెస్‌లో ఎవరు చేరినా మాకేమీ నష్టం లేదు
- వైఎస్సార్‌సీపీని ఆదిలోనే తుంచేయడానికి కాంగ్రెస్, టీడీపీ కుట్ర
- అప్పుడే ఏం చేయలేని వారు.. ఇప్పుడేం చేస్తారు
- వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి



సాక్షి, అమరావతి: కాంగ్రెస్‌లో షర్మిలమ్మ చేరడం వెనుక టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు కుట్ర ఉందని వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి, ప్రభుత్వ సలహాదారు(ప్రజా వ్యవహారాలు) సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. ఇక అధికారం కలే అని గ్రహించిన చంద్రబాబు.. దింపుడుకళ్లం ఆశలతో ఈ కుట్రకు పాల్పడ్డారని మండిపడ్డారు. వెలగపూడిలోని తాత్కాలిక సచివాలయంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ పవన్ కళ్యాణ్‌ను చేతిలో పెట్టుకున్న చంద్రబాబు.. తన మనుషుల ద్వారా ఒక వైపు కాంగ్రెస్‌ను.. మరో వైపు బీజేపీని మేనేజ్ చేస్తున్నారని, మీడియా ద్వారా ప్రజల దృష్టి మళ్లించేందుకు రకరకాల ప్రయత్నాలు చేస్తున్నారని అన్నారు. చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు ప్రజలకు చేసిన మంచి ఏమీ లేకపోవడంతో ఇప్పుడేమీ చెప్పుకోలేక ఇప్పుడు రకరకాల కుట్రలు చేస్తున్నారని విమర్శించారు. ఆ కుట్రలో భాగంగానే షర్మిలమ్మ కాంగ్రెస్‌లో చేరికన్నారు. షర్మిలమ్మ సీఎం రమేశ్ విమానంలో వెళ్లడం.. టీడీపీ నేత బీటెక్ రవిని బ్రదర్ అనిల్ కలవడం యాదృశ్చికమని తాము అనుకోవడం లేదన్నారు. క్రిస్టియన్ ఓట్లను ప్రభావితం చేయడానికి కుట్రలు చేస్తున్నారంటూ గతంలో ఇదే టీడీపీ నేతలు బ్రదర్ అనిల్‌పై ఏ స్థాయిలో దుమ్మెత్తిపోశారో అందరికీ గుర్తుందన్నారు. టీడీపీ నేత బీటెక్ రవిని ఎయిర్‌పోర్ట్‌లో బ్రదర్ అనిల్ మర్యాదపూర్వకంగా కలవడం వంటి వాటన్నింటినీ పరిశీలిస్తే షర్మిలమ్మ కాంగ్రెస్‌లో చేరడం వెనుక చంద్రబాబు కుట్ర ఉందన్నది అర్థమవుతోందన్నారు.

కాంగ్రెస్‌లో ఎవరు చేరినా నష్టం లేదు..

రాజకీయ ప్రస్థానం మొదలు పెట్టి, పార్టీ పెట్టి, తన పార్టీని కాంగ్రెస్‌లో విలీనం చేయడం ద్వారా ఆపార్టీలో చేరడం షర్మిలమ్మ ఇష్టమని సజ్జల అన్నారు. అండమాన్ నుంచి ఆంధ్రప్రదేశ్ వరకూ ఎక్కడైనా పనిచేస్తానని ఆమె అన్నారని, రాష్ట్రంలోనే రాజకీయం చేస్తానని ప్రకటించలేదన్నారు. ఒకవేళ రాష్ట్రానికి వస్తే కాంగ్రెస్ నాయకురాలిగానే తాము చూస్తామన్నారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి నోటా కంటే తక్కువ ఓట్లు వచ్చాయని.. అలాంటి పార్టీ గురించి ఎంత తక్కువ మాట్లాడుకుంటే అంత మంచిదన్నారు. రాష్ట్రంలో ఉనికేలేని కాంగ్రెస్ పార్టీలో ఎవరు చేరినా తమకు ఎలాంటి నష్టం లేదని స్పష్టం చేశారు.

అప్పట్లో కాంగ్రెస్, టీడీపీ కలసి కుట్ర..

మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి మరణంపై కాంగ్రెస్‌కు సంబంధించి తమకు అనుమానాలు ఉన్నాయని సజ్జల పునరుద్ఘాటించారు. వైఎస్ మరణం తర్వాత అప్పట్లో కేంద్రం, రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్, ప్రధాన ప్రతిపక్షం టీడీపీ కుమ్మక్కై జగన్‌పై తప్పుడు కేసులు పెట్టారని గుర్తు చేశారు. వైఎస్సార్‌సీపీని స్థాపించాక కడప లోక్‌సభ, పులివెందుల శాసనసభ ఉప ఎన్నికల్లో వైఎస్ జగన్‌ను, వైఎస్ విజయమ్మను ఓడించటం ద్వారా పార్టీని మొగ్గలోనే తుంచేయడానికి అప్పటి అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష టీడీపీ కుమ్మక్కై కుట్ర చేశాయన్నారు. పులివెందుల ఉపఎన్నికలో వైఎస్ విజయమ్మపై వైఎస్ వివేకాను పోటీకి పెట్టారని గుర్తు చేశారు. ఆ ఎన్నికల్లో వైఎస్ విజయమ్మ 80 శాతం ఓట్లు సాధించి ఘనవిజయం సాధిస్తే.. కడప లోక్‌సభ స్థానం నుంచి జగన్ రికార్డు మెజార్టీతో విజయం సాధించారన్నారు. అటు కేంద్రంలో, ఇటు రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడే వైఎస్సార్‌సీపీపై కుట్ర చేసి బొక్కబోర్లా పడ్డ చంద్రబాబు, కాంగ్రెస్ ఇప్పుడు ఏమీ చేయలేరని స్పష్టం చేశారు.

ఆది నుంచి కాంగ్రెస్‌తోనే చంద్రబాబు..

మహానేత వైఎస్ మరణించినప్పటి నుంచి టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు తెరవెనుక కాంగ్రెస్‌తో సంబంధాలు కొనసాగిస్తూ వస్తున్నారని సజ్జల ఆరోపించారు. సీఎం వైఎస్ జగన్‌ను ఎన్నికల్లో నేరుగా ఎదుర్కోలేక చంద్రబాబు కుట్రలు చేస్తున్నారని.. ఆ కుట్రలో భాగంగానే షర్మిల చేరికని ఆరోపించారు. ఇక రాష్ట్రంలో జరగబోయే డ్రామా అంతా చంద్రబాబు ఆధ్వర్యంలోనే జరగనుందన్నారు. ప్రజా సమస్యలపై కాకుండా.. ప్రజలకు సంబంధం లేని సంచలనాలు సృష్టించడమే చంద్రబాబు నైజమన్నారు.

అభ్యర్థుల మార్పు సహజమే..

ఎన్నికల్లో అభ్యర్థుల మార్పుపై అన్ని పార్టీల్లోనూ సహజ ప్రక్రియేనని సజ్జల ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. రాష్ట్రంలో 175కు 175 స్థానాల్లో విజయమే లక్ష్యంగా సమన్వయకర్తలను మారుస్తున్నారని చెప్పారు. వివిధ వర్గాల ద్వారా సేకరించిన ప్రజాభిప్రాయం, ప్రజల ఆకాంక్షలు, సామాజిక సమీకరణాలను బేరీజు వేసుకుని.. అందరితో చర్చించే అవసరమైన చోట్ల సమన్వయకర్తలను మార్చుతున్నామని చెప్పారు. సీఎం జగన్ నిర్ణయాన్ని అందరూ స్వాగతిస్తున్నారని.. వ్యక్తిగత కారణాలతోనే కొందరు పార్టీని వీడుతున్నారని స్పష్టం చేశారు.

టీడీపీని వదిలేస్తున్నా..

విజయవాడ ఎంపీ కేశినేని నాని

- దొంగే.. దొంగ.. దొంగ.. అన్నట్లుగా చంద్రబాబు తీరు
- ఆ పార్టీకి ఎంతో సేవ చేశా.. నన్ను పొమ్మంటున్నారు
- ఆ పార్టీలో కొనసాగడంలో అర్థం లేదు
- ఇతర పార్టీల నేతలతో కలిసి అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటే తప్పా?
- ముందుగా ఎంపీ పదవికి రాజీనామా.. ఆ తరువాత టీడీపీకి రాజీనామా
- అభిమానులు, కార్యకర్తలతో చర్చించి భవిష్యత్తు కార్యాచరణ ప్రకటిస్తానని వెల్లడి



సాక్షి ప్రతినిధి, విజయవాడ: 'దొంగే.. దొంగ.. దొంగ..' అన్నట్లుగా ఉంది చంద్రబాబు తీరు. ఇక తెలుగుదేశం పార్టీలో ఉండను. ఆ పార్టీని వదిలేస్తున్నా' అంటూ విజయవాడ ఎంపీ కేశినేని శ్రీనివాస్ (నాని) సంచలన ప్రకటన చేశారు. రెండుసార్లు ఎంపీగా చేసి, పార్టీకి ఎంతో సేవ చేసిన తనను చంద్రబాబు పొమ్మన్నారని చెప్పారు. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలతో కలిసి అభివృద్ధి పనుల్లో పాల్గొంటున్నాననే సాకుతో తనను పార్టీ నుంచి దూరంగా పెట్టారని వాపోయారు. ఎంపీ నాని శనివారం ఉదయం ఎన్టీఆర్ జిల్లా నందిగామ నియోజకవర్గం చందర్లపాడు మండలం చింతలపాడు గ్రామంలో రూ. 25 లక్షలతో నిర్మించే కమ్యూనిటీ భవనానికి ఎమ్మెల్యే మొండితోక జగన్మోహనరావుతో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం నాని మీడియాతో మాట్లాడుతూ.. ఇప్పటివరకు తాను కొనసాగిన టీడీపీని వదిలేస్తున్నానంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. ''నేను టీడీపీని వదిలేస్తున్నా. ఆ పార్టీకి నా అవసరం లేనప్పుడు.. నేను అందులో కొనసాగడంలో అర్థం లేదు. ఇప్పటికే లోక్‌సభ స్పీకర్ అపాయింట్‌మెంట్ తీసుకున్నా. ముందుగా ఢిల్లీ వెళ్లి ఎంపీ పదవికి రాజీనామా లెటర్ స్పీకర్‌కు ఇచ్చి, ఆమోదింపజేయించుకుని వస్తా. ఆ వెంటనే తెలుగుదేశం పార్టీకి రాజీనామా చేస్తా' అని చెప్పారు. ప్రజా అభివృద్ధి పనుల్లో ఇతర పార్టీల ప్రజాప్రతినిధులతో కలిసి పాల్గొంటే తప్పేమిటని ప్రశ్నించారు. తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవల ప్రధాన నరేంద్ర మోదీని కలుసుకున్న వైనాన్ని ఉదహరిస్తూ.. 'ప్రధానిని కలుసుకున్న తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి బీజేపీ నాయకుడు అయిపోతాడా? ఒక పార్టీ నాయకులు మరో పార్టీ నాయకులతో కలిసి పర్యటించకూడదని రాజ్యాంగంలో రాసుందా?' అంటూ బాబును ప్రశ్నించారు.

పార్టీ మార్పు నిర్ణయాధికారం అభిమానులదే

భవిష్యత్తు రాజకీయ కార్యాచరణ, ఏ పార్టీలోకి వెళ్లాలో తన అభిమానులకే వదిలేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా తనకు అభిమానులున్నారని, తనపై ఎంతో మంది ఆధారపడి ఉన్నారని అన్నారు. ఎంపీ పదవితో రాజకీయాలను వదిలేసి విశ్రాంతి తీసుకుందామనుకున్న తన తన నిర్ణయాన్ని అభిమానులు వ్యతిరేకించారన్నారు. ముందుగా టీడీపీకి రాజీనామా చేస్తానని ప్రకటించారు. అభిమానులు, శ్రేయోభిలాషులు, కార్యకర్తలతో చర్చించి భవిష్యత్తు కార్యాచరణ వెల్లడిస్తానని చెప్పారు. అభిమానులు ఏ పార్టీకి జై కొడితే అదే పార్టీలో చేరతానని స్పష్టం చేశారు.

ఈనాడు వార్తలు సరైనవి కావు

రాజకీయాలంటే త్యాగమని ఎంపీ నాని అన్నారు. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలతో కలిసి అభివృద్ధి పనుల్లో భాగస్వామ్యం అవుతున్నానని ఇటీవల ఈనాడు పత్రికలో రాశారని, అలాంటి వార్తలు సరైనవి కావని అన్నారు. ఎమ్మెల్యే సూచన మేరకు రోడ్డు అభివృద్ధి పనులకు కేంద్రం నుంచి నిధులు తీసుకొచ్చానని, ఎమ్మెల్యేతో కలిసి పాల్గొంటే తప్పేమిటని అన్నారు. ఎవరితో కలిసి పాల్గొనాలో ఈనాడే నిర్ణయిస్తుందా అని ప్రశ్నించారు.

జిల్లా వార్తలు

రామయ్యను దర్శించుకున్న సినీనటులు



పంచవటీ కుటీరంలో నటులు

దుమ్ముగూడెం: మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన పర్ణశాల శ్రీసీతారామచంద్రస్వామి వారిని సినీ, టీవీ నటులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా సోనీసింగ్, జస్వంత్ పడాల జెస్సీ, సిద్ధురాం, సాయిరాం తదితరులు స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం పంచవటీ కుటీరం, నారచీరల ప్రాంతాలను సందర్శించి వాటి విశిష్టత తెలుసుకున్నారు.

కేంద్ర ప్రభుత్వ వైఖరిని ఎండగట్టండి

- పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆజాద్



మాట్లాడుతున్న నామాల ఆజాద్

ఖమ్మంమయూరిసెంటర్: పేద, బడుగు, బలహీన వర్గాలకు విద్యను దూరం చేసేలా కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విద్యా, వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నామాల ఆజాద్ పిలుపునిచ్చారు. ఖమ్మంలోని రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. శాస్త్రీయ భావజాలాన్ని చొప్పించి, అశాస్త్రీయ భావజాలంతో కూడిన మత చాందస భావాలతో కూడిన పాఠ్యాంశాలను పొందుపర్చడం సమంజసం కాదన్నారు. ప్రభుత్వ విద్యాసంస్థలకు నిధులు కేటాయించకుండా యూనివర్సిటీ గ్రాంట్స్ విడుదల చేయకుండా విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తోందని విమర్శించారు. సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు ఆవుల అశోక్ మాట్లాడుతూ.. మోదీ ప్రభుత్వం రాజ్యాంగ వ్యవస్థలను నీరుగార్చేందుకు భారత న్యాయ చట్టాల పేరుతో మనువాద భావజాలాన్ని తీసుకొచ్చిందని ఆరోపించారు. ఈ మేరకు పాలకులకు వ్యతిరేకంగా ఉద్యమించేందుకు విద్యార్థులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. తొలుత సంఘం జిల్లా కార్యదర్శి వి.వెంకటేశ్ అమరవీరులకు సంతాప తీర్మానం ప్రవేశపెట్టగా, నాయకులు ఝాన్సీ, దీపిక, నవీన్, కిరణ్, లక్ష్మణ్, కరుణ్, శ్రీకాంత్, శశి, చంద్రశేఖర్, శ్రీకాంత్, గురు పాల్గొన్నారు.

దేశం గర్వించేలా తీర్చిదిద్దాలి..



భద్రాచలం ఐటీడీఏ విద్యార్థులకు ట్రోఫీ అందజేస్తున్న పీఓ ప్రతీక్‌జైన్

- కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు
- ముగిసిన రాష్ట్రస్థాయి గిరిజన క్రీడోత్సవాలు
- ఓవరాల్ చాంపియన్‌గా ఉట్నూరు, రెండో స్థానంలో భద్రాచలం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సాంబశివరావు, వేదికపై పీఓ ప్రతీక్ తదితరులు

పాల్వంచరూరల్: గిరిజన విద్యార్థులకు సరైన రీతిలో శిక్షణ ఇస్తే దేశం గర్వించతగిన క్రీడాకారులుగా తీర్చిదిద్దొచ్చని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తెలిపారు. పాల్వంచ మండలం కిన్నెరసానిలోని స్పోర్ట్స్ స్కూల్‌లో మూడు రోజులుగా జరుగుతున్న రాష్ట్రస్థాయి గిరిజన గురుకులాల క్రీడోత్సవాలు శనివారం ముగిశాయి. ఈసందర్భంగా ముగింపు సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే, భద్రాచలం ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్‌తో కలిసి విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే కూనంనేని మాట్లాడుతూ గ్రామీణ గిరిజన విద్యార్థులు సహజంగానే దృఢంగా ఉంటారని, వీరికి సరైన రీతిలో శిక్షణ ఇస్తే జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో రాణిస్తారని తెలిపారు. అయితే, విద్యార్థులు చదువుకుంటూ క్రీడల్లో తర్ఫీదు పొందాలని.. తద్వారా ఉన్నతమైన భవిష్యత్ సొంతమవుతుందని చెప్పారు. పీఓ ప్రతీక్ మాట్లాడుతూ గిరిజన విద్యార్థులు చదువు, క్రీడల్లో ప్రతిభ చాటి ఐఏఎస్, ఐపీఎస్‌లుగా రాణించాలని ఆకాంక్షించారు. తన మాదిరి ఐఏఎస్ సాధించి ఐటీడీఏలో పీఓ సీట్‌లో కూర్చున్న నాడు చాలా సంతోషిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీడీ మణెమ్మ, ఏపీఓ డేవిడ్‌రాజు, రాష్ట్ర స్పోర్ట్స్ ఆఫీసర్ జ్యోతి, వివిధ జిల్లాల అధికారులు బి.గోపాల్‌రావు, బి.రమేష్, మీనారెడ్డి, కిష్టు, జి.చందన్, ఎస్.చంద్రమోహన్, కె.జహీరుద్దీన్, పి.నర్సింహారావు, బి.రూపాదేవి, టి.రమణయ్య, నాగేశ్వరరావు, చందు తదితరులు పాల్గొన్నారు.

చాంపియన్‌గా ఉట్నూరు

రాష్ట్రస్థాయి క్రీడాపోటీల్లో ఉట్నూరు ఐటీడీఏ పరిధిలోని గురుకులాల విద్యార్థులు ఓవరాల్ చాంపియన్ షిప్ సాధించారు. ఇక రెండో స్థానాన్ని భద్రాచలం ఐటీడీఏ పరిధి విద్యార్థులు దక్కించుకున్నారు. వాలీబాల్ బాలికల విభాగంలో భద్రాచలం, ఉట్నూరు, బాలుర విభాగంలో భద్రాచలం, ఉట్నూరు, ఖోఖోలో ఉట్నూరు-2, ఏటూరు నాగారం మొదటి రెండు స్థానాల్లో నిలిచారు. అలాగే, టెన్నికాయిట్, చదరంగం, ఆర్చరీ పోటీల్లో విజేతలకు ట్రోఫీలు అందజేశారు.

క్రీడాకారుడిగా పీఓ..

నిత్యం విధినిర్వహణలో బిజీగా గడిపే భద్రాచలం ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్ కాసేపు క్రీడాకారుడిగా మారిపోయారు. కిన్నెరసానిలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల ముగింపు సమావేశానికి హాజరైన విద్యార్థులతో కలిసి వాలీబాల్ ఆడుతూ వారిని ఉత్సాహపరిచారు.



వాలీబాల్ ఆడుతున్న భద్రాచలం ఐటీడీఏ పీఓ ప్రతీక్

ఇది మైదానమా?





పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో క్రీడాకారులను ప్రోత్సహించేందుకు గత ప్రభుత్వం తెలంగాణ గ్రామీణ, పట్టణ క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేయించింది. అయితే, ప్రభుత్వ స్థలాలు లేక అధికారులు హడావుడిగా ఊరికి దూరంగా క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేయడంతో క్రీడాకారులకు ఉపయోగపడటం లేదు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గుండాల మండలం నడిమిగూడెం గ్రామంలో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణం గుంతలు, రాళ్లతో కూడి ఉండటంతో పేరుకు మాత్రమే ఆటస్థలంగా మిగిలిపోయింది. –స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఖమ్మం

రైల్వే అధికారుల అలసత్వం

సమాచారం ఇవ్వకుండానే గేట్ మూసివేత



రైల్వే గేట్ వద్ద నిలిచిన వాహనాలు

కారేపల్లి: రైల్వే అధికారుల నిర్లక్ష్యం కారణంగా వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. కారేపల్లి – పేరుపల్లి రైల్వే గేట్‌ను మరమ్మతుల దృష్ట్యా అధికారులు మూడు రోజులుగా మూసివేశారు. దీంతో మాధారం, పేరుపల్లి, రావోజీతండా, మల్లన్నగూడెం, జమాళ్లపల్లి, గంపెళ్లగూడెం, కొత్తతండా, కట్టుగూడెం గ్రామాల ప్రజలు, వాహనదారులు కారేపల్లికి రావాలన్నా, ఖమ్మం వెళ్లాలన్నా.. సూర్యతండా, అప్పాయిగూడెం మీదుగా ఇల్లెందు – కారేపల్లి రైల్వే గేట్ నుంచి వెళ్లాల్సి వస్తోంది. ఇంతలోనే ముందస్తు సమాచారం ఇవ్వకుండా ట్రాక్ మరమ్మతుల పేరిట శనివారం ఇల్లెందు – కారేపల్లి రైల్వే గేట్ సైతం మూసేశారు. దీంతో వాహనదారులు ఎటునుంచి వెళ్లాలో తెలియక గంటపాటు పడిగాపులు కాశారు. ఈ ఇల్లెందు గేట్ వద్ద ఉన్న రైల్వే అధికారులను నిలదీశారు. వాహనాదారుల ఇక్కట్లు పట్టించుకోకుండా గేట్ మూసివేయటం ఏమిటని ప్రశ్నించారు. చివరకు పనులు పూర్తయ్యాక గేట్ తీయడంతో రాకపోకలు మొదలయ్యాయి.

ఫుట్‌బాల్‌లో 'సీ' కేటగిరీ శిక్షణ పూర్తి



కె.ఆదర్శ్‌కుమార్

ఖమ్మం స్పోర్ట్స్: ఫుట్‌బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఇటీవల పశ్చిమబెంగాల్ రాష్ట్ర గంగాధర్‌పూర్‌లో నిర్వహించిన 'సీ' కేటగిరీ శిక్షణను ఫుట్‌బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి కె.ఆదర్శ్‌కుమార్ పూర్తిచేశారు. జిల్లా నుంచి ఆయన మాత్రమే శిబిరానికి ఎంపిక కాగా, శిక్షణ పూర్తవడంతో జాతీయస్థాయి జూనియర్ కేటగిరీ జట్ల సెలక్టర్‌గా అవకాశం దక్కనుంది. ఈసందర్భంగా ఆదర్శ్‌ను కలెక్టర్ వీ.పీ. గౌతమ్, డీఈఓ సోమశేఖర శర్మ, డీవైఎస్ఓ టి.సునీల్ రెడ్డి, ఫుట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సెల్యూకాస్ అభినందించారు.

ఆటోలో నెదర్లాండ్స్ వాసుల దేశాటన



టేకులపల్లిలో టిఫిన్ చేస్తున్న నెదర్లాండ్స్ దేశస్తులు

టేకులపల్లి: భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు ఆకర్షితులైన నెదర్లాండ్స్‌కు చెందిన ఓ కుటుంబం ఆటోలో దేశపర్యటన చేస్తోంది. నెదర్లాండ్స్ దేశానికి చెందిన ఫిన్, క్రే, బెన్ని, టైమ్, జిన్ ఐదుగురు సభ్యులు కలిగిన కుటుంబీకులు భారత్ వచ్చారు. కేరళలో పర్యటించిన అనంతరం రెండు ఆటోలు తీసుకుని దేశంలోని ప్రముఖ పుణ్యక్షేత్రాలు, చారిత్రక ప్రదేశాలను సందర్శిస్తున్నారు. ఇందులో భాగంగా అరుణాచల్‌ప్రదేశ్‌కు వెళ్తున్న వారు శనివారం ఉదయం టేకులపల్లిలో టిఫిన్ కోసం ఆగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భారతీయ సంస్కృతీ, సంప్రదాయాలే కాక ఇక్కడి వంటకాలు, భిన్నత్వంలో ఏకత్వం కనబరిచే ప్రజలు చాలా నచ్చారని తెలిపారు.

హోరాహోరీగా నెహ్రూ కప్

నేడు ఖమ్మం – భద్రాచలం మధ్య ఫైనల్స్



మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందజేస్తున్న నిర్వాహకులు

భద్రాచలంటౌన్: భద్రాచలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడామైదానంలో వారం రోజులుగా జరుగుతున్న నెహ్రూ కప్ అంతర్రాష్ట్ర క్రికెట్ పోటీలు తుది దశకు చేరాయి. శనివారం జరిగిన సెమీస్‌లో చందు లెవెన్ భద్రాచలం జట్టుపై మాస్టర్స్ లెవెన్ ఖమ్మం జట్టు ఘన విజయం సాధించింది. మరో సెమీస్ బెస్ట్ క్రికెట్ అకాడమీ భద్రాచలం, వైఎంసీసీ ఇల్లెందు జట్ల మధ్య జరగగా భద్రాచలం జట్టు గెలుపొందింది. దీంతో ఆదివారం జరిగే ఫైనల్స్‌లో మాస్టర్స్ లెవెన్ ఖమ్మం-బెస్ట్ క్రికెట్ అకాడమీ భద్రాచలం జట్లు తలపడనున్నాయి. కాగా, శనివారం మ్యాచ్‌ల్లో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులకు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డులను పాల్‌రాజ్ ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ వి.వరలక్ష్మితోపాటు పాకలపాటి దుర్గాప్రసాద్, బాలయోగి, నాగార్జున, సలీమ్, సదానందం, అజీమ్, శ్రీనివాసరావు, బాలమురళీకృష్ణ, తిరుమలరావు, రామకృష్ణ పాల్గొన్నారు.